# నాన్నగారి జ్ఞాపకాలు

- డా.గాయత్రీదేవి



1974 నుంచి దాదాపు ఒక దశాబ్దం పాటు ఆశేష ఆంధ్ర శ్రోతలనీ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి కట్టిపడేసిన కార్యక్రమం – ధర్మ సందేహాలు(వ్యాసపీఠం). ఆ కార్యక్రమం అంత ఆసక్తికరం కావడానికి ముఖ్యకారణం శ్రీ ఉషశ్రీ – ఉషశ్రీగారి గంభీరగళం, అనితరసాధ్యమైన కథనశైలి. ఆ రోజుల్లో ఆదివారం మధ్యాహ్నం ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ఈ కార్యక్రమం ప్రసారమయ్యే సమయంలో ఏ పూటకాపూట సంపాదించుకుంటే కానీ రోజుగడవని రిక్షా వాళ్ళు కూడా బేరం దొరికినా రిక్షా కట్టేవారు కాదు, కార్యక్రమం పూర్తయేవరకూ. ఏ కిళ్ళీ కొట్టు దగ్గరో చేరి, భక్తిశ్రద్ధలతో 'ధర్మసందేహాలు' కార్యక్రమం విన్నాకనే బేరం చూసుకునేవారు. అంతగా పామరులనీ పండితులనీ సమంగా ఆకర్షించింది ఆ కార్యక్రమం. ఆ ఆకర్షణ ఎంతంటే – నాలుగు దశాబ్దాల తర్వాత ఈ రోజుకి కూడా రామాయణ, భారతాల ప్రవచనాలంటే ఉషశ్రీ గారినే గుర్తుచేసుకుంటున్నారు.

ఉషశ్రీ గళానికి ఉన్న శక్తి కలానికి కూడా ఉంది. ఉషశ్రీ రాసిన రామాయణ, భాగవత, భారత కథలని చదువుతోంటే విన్నట్లే ఉంటుంది. ఆయన కలం నుండి జాలువారిన రచనలు ఒక్కొక్కటీ ఎన్నో లక్షల ప్రతులుగా ప్రజల దగ్గరకి చేరి వాళ్ళ ఇళ్ళల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఉషశ్రీగారి సాహిత్యాన్ని ఈ తరానికి అందించడంలో విశేషమైన కృషి చేస్తున్నారు, వారి కుమార్తె డా.గాయత్రీ దేవిగారు.

'నాన్నగారి జ్ఞాపకాలు' శీర్షికలో డా.గాయత్రీదేవిగారు ఉషశ్రీగారి జీవితాన్ని ఈ తరం పాఠకులకు 'కౌముది' ద్వారా అందిస్తున్నారు.

( క్రిందటి సంచిక నుంచి తరువాయి)

## మళ్ళీ దొడ్డమ్మ ఇంటికి




ఉవ్వెత్తున ఉప్పొంగుతున్న ఉద్రేకాన్నీ, వరదలా ఉరుకుతున్న కన్నీరునీ అణచుకుని, మలకపేటలో ఉన్న బీబీ హాస్పిటలుకి తీసుకుని వెళ్లాను. అది ఆగస్ట్ ఇరవై నాలుగో ఇరవై అయిదో తారీకు అయ్యుంటుంది. అక్కడకి వెళ్ళాక నాన్నకీ అర్థం అయింది తనకి వచ్చింది కేన్సరని. అంతకు కొన్ని నెలల ముందు అక్కడే విశ్వనాథ సత్యనారాయణ గారి అమ్మాయికీ, అల్లుడికీ కాన్సర్ వైద్యం జరగడం నాన్నకి తెలుసు. అందుకే ఆ హాస్పిటల్ పేరు చూడగానే నాన్నకి తన అనారోగ్యం ఏమిటో తెలిసింది. తనకి తెలిసినట్లు నా ముందు వ్యక్తం చెయ్యలేదు నాన్న. అదే మా నాన్న ప్రత్యేక లక్షణం. తనకి తెలిసిన ప్రతీదాని గురించీ మాటాడెయ్యరు, ఎటువంటి పరిస్థితిలోనయినా సరే.....

మలకపేట దిల్షుఖ్ నగర్ కి దగ్గరే అని దిల్షుఖ్ నగర్ లో ఉంటున్న మా దొడ్డమ్మ వాళ్ళింటికి మకాం మార్చాం.అప్పటి వరకూ విజయవాడలోనే ఉన్న మా అమ్మ కూడా హైదరాబాద్ వచ్చింది.

ఇప్పుడు తలుచుకుంటే సంఘటనలు ఎంత చిత్రంగా జరుగుతాయా అని అనిపిస్తుంది. నన్ను చిన్నపిల్లగా హైదరాబాద్ తీసుకొచ్చిన కొత్తలో నన్నూ అమ్మనూ దొడ్డమ్మ దగ్గరే ఉంచార్పు నాన్న. నాన్న చివరి రోజుల్లో మేం ఇద్దరం మళ్ళీ అక్కడే ఉన్నాం. దొడ్డమ్మా, పెద్దనాన్నా కూడా మహా దొడ్డ మనస్సున్న వాళ్ళు. వాళ్లిద్దరి దగ్గరా బాగా చనువు నాన్నకి. దొడ్డమ్మా నాన్నా ఐతే ఒకరి మీదొకరు జోకులేసుకునేవారు. నాన్న బీబీలో ఉన్న పన్నెండు రోజులూ దొడ్డమ్మ ఆరోజుల్నే తల్చుకుంటూ ఉండేది.

అప్పుడే వినాయక చవితి వచ్చింది. దొడ్డమ్మ నాన్న కోసం ఉండ్రాళ్ళూ, పరవాన్నం చేసి తీసుకొచ్చింది. అప్పుడు కూడా నాన్న దొడ్డమ్మతో హాస్య ధోరణిలో మాట్లాడారు తప్ప జబ్బు గురించి మాట మాత్రం మాట్లాడలేదు. దొడ్డమ్మా, పెద్దనాన్నా – ఇద్దరూ నాకు ధైర్యం చెప్తూనే ఉండేవారు. పిల్లకైతే వాళ్లతో బాగా కాలక్షేపం. వాళ్లింటి దొడ్లో ఉన్న మొక్కల్లో తిరుగుతూ ఉండేది.

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. అంత చిన్నపిల్లైనా – అది మేం హైదరాబాదులో ఉన్న నెల రోజుల్లో ఒక్క రోజు కూడా – కష్టపెట్టలేదు. ఎవరింట్లో ఉంటే వాళ్లతో సరిపెట్టుకునేది. ఎక్కడ ఉంటే అక్కడ మనుషులకీ, భోజనానికీ, గదులకీ, సమయాలకీ అలవాటు పడిపోయేది.

నాన్న గురించి చెప్పేది ఏముంది? ఒక్కసారి కూడా నన్ను హైదరాబాద్ తీసుకొచ్చావెందుకమ్మా అని అనలేదు. ఎంత బాధనైనా భరించారు. అంత బాధలోనూ నువ్వు భోంచేసావా? పిల్ల ఎలా ఉంది అని అడిగారే కానీ ఒక్కసారి కూడా తన బాధను గురించి నాతో అనలేదు. నన్ను కష్టపెట్టకూడదనే నాన్న తాపత్రయం అంతా.

అంతే కాదు. తనకెంతో ఇష్టమైన మనవరాల్ని ఒక్కసారి కూడా హాస్పిటలుకి తీసుకు రమ్మనలేదు. చిన్నపిల్లని హాస్పిటలుకి తీసుకు రాకూడదన్న వివేకాన్ని – అంత బాధలోనూ కోల్పోలేదు నాన్న. అంత కష్టంలోనూ సంయమనాన్ని వదులుకోలేదు. ఇప్పుడు తలచుకుంటే ఎంత బాధగానో అనిపిస్తుంది.

తన బాధంతా పెండ్యాలగారితో చెప్పుకునేవారుట. ఆ తర్వాత చెప్పారాయన. కేన్సరూ, దాని ట్రీట్మెంటూ అంతా ఒక నరకం. అంత నరకం అనుభవించాల్సి వచ్చింది . ఒక్కోసారి బాధని భరించలేక కరెంట్ స్విచ్చిల్లో వేళ్ళు పెట్టెయ్యాలని అనిపిస్తోందని అనేవారుట ఆయనతో.

అంత బాధ పడుతూ కూడా తన హాస్యాన్ని వదిలిపెట్టలేదు. ఓ సారి నాన్నని గదిలోంచి ట్రీట్మెంట్ రూం కి తీసికెళ్ళడానికి వచ్చిన వార్డ్ బాయ్స్ తో – వచ్చారా వాహకులు మోసెయ్యండి అని హాస్యమాడేవారు. నిన్ను చూడ్డానికి వచ్చిన స్నేహితులతో – ఇదిగో అంపశయ్యమీద ఉన్నానని అనేవాడివి.

కే కే రామానుజాచార్యులి గారి బావగారు – నల్లాంచక్రవర్తుల రామానుజాచార్యుల గారిని హాస్పిటలుకి పిలిపించుకుని – ఆయన చేత ఆయన రాస్తున్న రామాయణంలోని పద్యాలు చదివించుకునేవారు. ఆయన తరవాత ఒకచోట రాసుకున్నారు – ఆయన్ని రామాయణాన్ని పద్యంలో రాయమని ప్రోత్సహించింది నాన్నేనట.

హైదరాబాద్ లో ఉన్నన్నాళ్ళూ నాన్నని అంటుకుని ఉన్నది పెండ్యాలగారే. ఏజన్మ అనుబంధమో అనిపిస్తుంది తలచుకున్నప్పుడల్లా.

మేం హైదరాబాద్ వెళ్తున్నప్పుడు మాతో ప్రయాణమైన ఆయన్ని నేను నా జీవితంలో మొట్టమొదటి సారి చూసాను. మా ఇంటికి ఆయన వచ్చిందే లేదు. ఆయన గురించి నాన్న దగ్గర కూడా నేనెక్కువ విన్న గుర్తే లేదు. ఐతే నాన్న చివరి రోజులన్నీ ఆయన సేవతోనే గడిచిపోయాయి. ఆయన నాన్నకి చేసిందాన్ని ఏమనాలో నాకు తెలియదు.

మధ్యలో ఒకట్రెండు రోజులు ఏదో పనుండి వెళ్లింది వదిలేస్తే – ఆయన నాన్నని వదిలి పెట్టి ఉన్నది లేదు. ఒక్కోసారి తిన్నది గొంతు దిగక బయటకొచ్చేస్తోంటే – తన కండువాతో నాన్న నోరు తుడిచే వారాయన. ఆ దృశ్యం నా కళ్ళకి కట్టినట్లు కనిపించాలి కానీ ఒక్కసారి కూడా కనిపించదు. ఎప్పుడు ఆ విషయాన్ని తల్చుకున్నా కళ్ళకీ, గుండెకీ తడవుతుంది. అంతా మసక మసక గా కనిపిస్తుంది.

ఆయన లాంటి స్నేహితుల్ని సంపాదించుకున్న నాన్న జన్మ ధన్యం. నాన్న ద్వారా అలాంటి సత్సాంగత్యం అబ్బించుకున్న మా జన్మా ధన్యం.

కొన్నాళ్ళు బీబీలో ఉన్నాక అర్థమైందేమిటంటే – నాన్నకింక ఏ ట్రీట్మెంటూ అవసరం లేదని. ఈ రోజుల్లో ఎక్కువగా వాడుతున్న పేలియాటివ్ కేర్ – లాంటిది అప్పుడు ఎక్కువగా వినిపించేది కాదు. నాకైతే తెలియదు. నిజానికి అప్పుడు కావల్సింది అలాంటి ఆలంబన.

నాన్న శరీరానికి రేడియంలనీ, కెమికల్స్ని భరించే శక్తీ లేదు. కావల్సింది నొప్పిని తగ్గించే ఉపశమనపు వైద్యం.

అలాంటి ఉపశమనం కోసం కొన్నాళ్ళు ఏదైనా మంచి హాస్పిటల్లో ఉంచి – కొంత తగ్గగానే విజయవాడ ఇంటికి తీసికెళ్ళిపోదామని మసాబ్ టేంక్ దగ్గర మహావీర్ హాస్పిటల్లో చేర్చాను.

నా స్కూలూ, కాలేజీ రికార్డులన్నింట్లోనూ – తండ్రిగా నాన్నే నాకు గార్డియన్. ఐతే హైదరాబాద్లో నాన్నని చేర్చిన మూడు హాస్పిటళ్ళ రికార్డుల్లోనూ నేనే నాన్నకి గార్డియన్ని.

నేను నాన్నకి గార్డియన్నేంటి ? ఏమనుకోవాలి అలాంటి రికార్డుని?

ఈ వ్యాసాల ఆడియోలు ఇక్కడ వినవచ్చు: Link to Audios

**మా వెబ్ సైట్స్ - ushasri.com, drgayatridevi.com**

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments